క్లుప్తంగా

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దృష్టి లోపంతో బాధపడుతున్న 62 మంది విద్యార్థులకు సోమవారం ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు డాక్టరు గిరీషా తెలిపారు. గతంలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, దృష్టి సమస్యలున్న వారిని గుర్తించారు. వారికి ఇప్పుడు కళ్లద్దాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి, కంటి వైద్యులు ప్రసాదరాజు, ఆప్త మాలిక్ అసిస్టెంట్ నరసింహులు, సిబ్బంది నీలకంఠ, శిఖామణి, జానకి పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పలమనేరు: పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ రెండో సంవత్సరం చదువుతున్న రూపేష్ కన్యాకుమారి వివేకానంద కళాశాలలో జాతీయస్థాయి సెమినార్‌లో ప్రతిభ కనబరిచాడు. అలాగే హార్టికల్చర్ విద్యార్థిని మానస పుణెలో నిర్వహించిన ప్రి–రిపబ్లిక్ డే శిబిరంలో పాల్గొంది. వీరు కళాశాలకు పేరు తెచ్చారని సోమవారం ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్లు వెంకటేష్‌బాబు, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

వేలంలో రూ.5.99 లక్షలు ఆదాయం

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వ్యాపారాలకు చెందిన వేలం పాటలను కమిషనర్ మధుసూదన్‌రెడ్డి సోమవారం నిర్వహించారు. మరుగుదొడ్ల వేలంలో రూ.5.99 లక్షలు ఆదాయం లభించింది. వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేటు బస్టాండ్ వేలానికి పాటదారులు రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు కమిషనర్ తెలిపారు.

ముల్లుకే అరిటాకు దెబ్బ..!



చికిత్స పొందుతున్న వసంత్

పలమనేరు: ముల్లుపోయి అరిటాకు మీద పడినా..అరిటాకు వచ్చి ముల్లు మీద పడినా అరిటాకుకే దెబ్బ అని ఓ సామెత! అయితే ఓ యువకుడి విషయంలో ఈ సామెత కాస్తా రివర్స్ అయింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని టి.వడ్డూరుకు చెందిన వసంతకుమార్(25)కు అదే గ్రామానికి చెందిన ఓ బాలిక తరచూ ఫోన్ చేస్తూ ఉండేది. దీంతో వసంత్‌కుమార్ తన అక్క సుశీలకు ఈ విషయాన్ని చెప్పాడు. ఆ తర్వాత వసంత్‌కుమార్ తన అక్కతో కలిసి బాలిక తండ్రిని కలిశాడు. అతడి కుమార్తెను అదుపులో పెట్టుకోవాలని, తనకు తరచూ ఫోన్ చేస్తోందని, ఇది సరికాదని, అందుకే పెద్దల దృష్టికి తీసుకువచ్చినట్టు చెప్పాడు. అయితే దీనిపై ఆగ్రహించిన బాలిక తండ్రి వారిపైనే దాడి చేశాడు. దీంతో వసంత్‌కుమార్ ఆస్పత్రి పాలయ్యాడు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

డివిజన్ కార్యాలయం తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయాన్ని ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ సోమవారం పరిశీలించారు. ప్రహరీలోని అన్ని కార్యాలయాలను తనిఖీ చేశారు. త్వరలో రూరల్–3 డీఈ కార్యాలయం రెడ్డిగుంటకు మారనుంది. అక్కడ ఏ కార్యాలయం కేటాయించాలని అధికారులతో మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన ఈఆర్వో కార్యాలయాన్ని కొత్తగా నిర్మిస్తే అంతవరకు సిబ్బంది ఎక్కడ ఉండాలో చర్చించారు.

బతుకు గండి.. చూడరేమరి..!

పలమనేరు అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం చెత్తపెంట గ్రామస్తులకు శాపంలా మారింది. ఏడేళ్ల క్రితం చెరువుకు పడిన గండిని ఇప్పటివరకూ పూడ్చకపోవడంతో గ్రామస్తులకు తిండిగింజల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వర్షాలకు వచ్చే నీరు తెగిన గండిలోంచి అడవి మీదుగా తమిళనాడుకు చేరుతోంది. ఎన్నో చెరువులున్నా ఈ చెరువుకు మాత్రమే ఎందుకంత ప్రాముఖ్యతంటే ఇది ఊటచెరువు. వేసవిలోనూ చెరువులోంచి నీరు వస్తూనే ఉంటుంది. ఈ చెరువు మొరవనుంచి చెత్తపెంట సమీపంలోని మూడు చెరువులకు నీరు చేరేది. ఫలితంగా ఏడాదికి రెండు సార్లు వరి సాగు చేసేవారు.

- చెరువు గండితో బీళ్లు బారిన భూములు
- చెరువు అడవిలో ఉండడంతో పట్టించుకోని అధికారులు
- ఏటా వర్షపునీరు తమిళనాడు పాలు
- గండిపూడిస్తే మూడు చెరువులకు నీటి సరఫరా
- తిండిగింజల సమస్య కూడా తీరినట్టే





చెత్తపెంట అడవిలో ఎండిన కట్టుకాలువకుంట చెరువు, (ఇన్‌సెట్) చెరువు కట్టకు పడిన గండి(ఫైల్)

పలమనేరు: చెత్తపెంట గ్రామానికి పడమర వైపు అడవిలో కట్టుకాలువ కుంట ఉంది. దీనికి ఆనుకుని వంద ఎకరాల బండరాయి ఉంది. అక్కడి గుహల్లోంచి వచ్చే మంచినీటి ఊటతో ఈ చెరువులో నీళ్లు పుష్కలంగా ఉండేవి. ఈ చెరువు నిండి గ్రామానికి మూడువైపులా ఉన్న పెద్దచెరువు, నాయునిచెరువు, మద్దిలోని చెరువులకు నీరు చేరేది. ఈ చెరువుల కింద గ్రామానికి చెందిన 200 ఎకరాల ఆయకట్టుకు నీరు అందేది. రైతులు కేవలం వరిని కీలేర్లలో సాగు చేసేవారు. దీంతో అందరి ఇళ్లలో వడ్ల బస్తాలు నిల్వ ఉండేవి. అయితే అయితే ఏడేళ్ల క్రితం ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల ధాటికి ఈ చెరువుకు గండి పడింది. దీంతో చెరువులో నీరు నిలవడం లేదు. చెరువుకు పడిన గండితో వీరి ఆశలకు గండ్లు పడ్డాయి. ప్రస్తుతం బోర్లున్నవారు మినహా మిగిలిన రైతుల పొలాలు బీళ్లుగా మారాయి. ఇప్పుడు కీలేర్ల కింద వరిపంట సాగు ఆగిపోయింది.

వృధా అవుతున్న వర్షపు నీరు

వానాకాలంలో కట్టుకాలువ కుంటలోంచి ఊట నీరు, పైనున్న అటవీ ప్రాంతంలోని బండల నుంచి వచ్చే నీళ్లు గండిపడిన ప్రాంతం నుంచి అడవిలోకి వెళుతున్నాయి. తమిళనాడులోని రంగంపేట అడవి మీదుగా పేర్నంబట్ సమీపంలోని బత్తలపల్లె కైగల్ నదిలో కలసి తమిళనాడుకు వెళుతున్నాయి. గండిపడిన చెరువుకు మరమ్మతులు చేయాలని గత ప్రభుత్వ హయాంలో గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు నివేదించారు. దీంతో అప్పట్లో అధికారులు చెరువు గండిని పరిశీలించి, పూడ్చి, కట్ట మరమ్మతుల నిమిత్తం అంచనాలను సైతం ఉన్నతాధికారులకు పంపారు. ఎన్నికల సమయంలో ఈ పనులు అటకెక్కాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై కాల్వపల్లె ఎఫ్‌ఎస్‌ఓ రమేష్ వివరణ కోరగా..ఈ విషయం తన దృష్టికి రాలేదని, దానిని పరిశీలించి తగు చర్యల నిమిత్తం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ చెరువు గండి పూడిస్తే అడవిలోని వన్యప్రాణుల దాహం కూడా తీర్చినట్టవుతుందని ఆయన చెప్పారు.



వర్షాకాలంలో నీరు వచ్చే చెరువు పైభాగాన ఉన్న బండ



పక్కనే ఉన్న తమిళనాడు అడవికి నీరు వెళ్లే ప్రాంతం

నీళ్లు మొత్తం వృధా



మూడు చెరువులకు నీటి ఆధారంగా ఉన్న కట్టుకాలువ కుంట గండి కారణంగా గ్రామంలో కరువు వచ్చింది. రైతులకు తిండిగింజలు కరువయ్యాయి. చెరువులకింద భూములున్నా పంటలు సాగు చేయలేని దుస్థితి. అటవీశాఖ అధికారులు స్పందించి గండిని పూడ్చాలి. అప్పుడే మాఊరోళ్ల మేలు కలుగుతుంది. –మురగేష్, రైతు, చెత్తపెంట

పకడ్బందీగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో సోమవారం నుంచి ఓపెన్‌స్కూల్ పరీక్షలు మొదలయ్యాయి. ఇక్కడ మూడు సెంటర్లను ఏర్పాటు చేశారు. 'ఓపెన్ బేరం' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురించిన కథనంపై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఇక్కడి మూడు సెంటర్లలోనూ కస్టోడియన్, చీఫ్, ఇన్విజిలేటర్లుగా ప్రభుత్వ కళాశాల అధ్యాపకులను ఏర్పాటు చేశారు. సిట్టింగ్, ఫ్లెయింగ్ స్క్వాడ్‌లను పెట్టారు. దీంతో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చేశారు. ప్రతిసారి లాగే ఈసారి కూడా ఓపెన్ నిర్వాహకులు తమకు అనుకూలంగా ఏర్పాట్లు చేస్తారనే ఉద్దేశంతో కనీసం పుస్తకం కూడా ముట్టని ఎందరో ప్రశ్నపత్రంలోని ప్రశ్నలకు సమాధానాలు ఏం రాయాలో దిక్కుతోచక ఏదో ఒకటి రాసి పరీక్ష కేంద్రంగా నుంచి దిగులుగా బయటకు రావాల్సి వచ్చింది.

ప్రతి సమస్యనూ పరిష్కరించాల్సిందే!

– కడా పీడీ వికాస్ మర్మత్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కుప్పం: సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుతున్న వినతులన్నీ పరిష్కరించాల్సిందేనని కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక సచివాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి 28 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. వీటిలో తాగునీటి సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యనైనా క్షేత్రస్థాయిలో పరిష్కారమయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మేజర్ సమస్యలను కడా దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదని హితవు పలికారు.

గ్రామదేవత ఆలయం ప్రారంభం



అన్నదానం చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని షికారి కాలనీలో మత్తుమారెమ్మ ఆలయాన్ని సోమవారం ప్రత్యేక పూజల నడుమ ప్రారంభించారు. ఆ వార్డు కౌన్సిలర్ రాజేష్ ఈ ఆలయాన్ని నిర్మించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేకపూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ కౌన్సిలర్‌గా రాజేష్ తన వార్డులోని షికారీలకు నీటి సౌకర్యం కల్పించడం, విద్యనందివ్వడం, ఆపద సమయాల్లో ఆదుకోవడం లాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. తన పుట్టినరోజు సందర్భంగానే ఆలయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఇక్కడి షికారీల ఆశీస్సులు సైతం ఆయనకు దక్కుతాయన్నారు.కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, సుధాకర్ నాయుడు, వార్డులోని నాయకులు పాల్గొన్నారు.

దాహార్తి సమస్య తీర్చడానికే కొత్త బోర్లు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



బోరు డ్రిల్లింగ్‌కు పూజలు చేస్తున్న అమరనాథ్, గ్రామస్తులు

వి.కోట: దాహార్తి సమస్యలు తలెత్తకుండా చేయడానికే అవసరమైన గ్రామాల్లో కొత్తగా బోర్లు వేయిస్తున్నట్టు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండలంలోని కొంగాటం పంచాయతీ అన్నవరంలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్టు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించారు. జెడ్పీ నిధులను మంజూరు చేయించి నూతన బోరుకు శ్రీకారం చుట్టారు. బోరు డ్రిల్లింగ్ పనులను జెడ్పీ చైర్మన్ తనయుడు అమరనాథ్ భూమి పూజ చేసి ప్రారంభించారు. నీరు పుష్కలంగా పడడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పులు రాష్ట్ర ప్రభుత్వానికి వర్తించవా..?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్

పుంగనూరు: భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేయడం ఎంతమాత్రమూ సరికాదని మాల మహానాడు ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఆర్ అశోక్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పులు కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదని మండి పడ్డారు. నిజాయితీగా సునీల్‌కుమార్ విధులు నిర్వహించారని, గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సునీల్‌కుమార్‌ను సన్మానించి సేవలను కొనియాడారని తెలుపుతూ అప్పటి పత్రికల్లో వచ్చిన వార్తలను విలేకరులకు చూపించారు. అలాంటి వ్యక్తిని ఏమి చేయలేక దళితుడనే కారణంతో విదేశీ ప్రయాణాలకు అనుమతులు పొందలేదని సస్పెండ్ చేయడం శోచనీయమని నిరసించారు. దళిత కుటుంబంలో పుట్టిన ఆఫీసర్లకు వ్యక్తిగత స్వేచ్ఛ కూడా లేకుండా పోతోందని, ఇది ప్రభుత్వం చేస్తున్న కుట్ర అని ఆరోపించారు.

16 మంది విద్యార్థులు గైర్హాజరు

సదుం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 199 మంది విద్యార్థులకు గాను 183 మంది హాజరు, 16 మంది గైర్హాజరయ్యారని ఎగ్జామినేషన్ చీఫ్ వెంకటనాథ రెడ్డి తెలిపారు.

లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

పుంగనూరు: విశ్రాంత ఉద్యోగులందరూ తమ లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు చెంగారెడ్డి కోరారు. సోమవారం అసోసియేషన్ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించకపోతే సమస్యలు ఎదురవుతాయని, అలాగే సమస్యలను పరిష్కరించుకునేందుకు కార్యాచరణకు పూనుకుంటున్నట్టు చెప్పారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు వెంకటపతి, చంద్రశేఖర్, సుబ్రమణ్యం, కేశవరెడ్డి, రమేష్, రవి, రెడ్డెప్ప, శంకరప్ప, ఈశ్వర్‌రెడ్డి, భరత్ భూషణ్, లీలావతమ్మ, గంగులమ్మ, రెడ్డికుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెంగారెడ్డి

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

గంగవరం: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. నియోజకవర్గం మొత్తం 23 మంది ఎన్నికవగా గంగవరం మండలంలో ముగ్గురు ఎన్నికయ్యారు. వారిలో మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఆలకుప్పంకు చెందిన కవిత, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా మామడుగుకు చెందిన రమేష్‌రెడ్డి, సాంస్కృతిక విభాగానికి కొత్తపల్లెకు చెందిన బాలాజీ నియమితులయ్యారు. తమపై అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు తెలిపారు.

న్యాయవాదుల గుమాస్తా మృతి



భక్తవత్సలం (ఫైల్)

పుంగనూరు: పట్టణంలోని న్యాయవాదుల వద్ద గుమాస్తాగా పని చేస్తున్న భక్తవత్సలం(68) సోమవారం మండలంలో చదళ్లలోని నివాసంలో హఠాన్మరణం చెందారు. పలువురు న్యాయవాదుల వద్ద సుమారు 40 ఏళ్లు గుమాస్తాగా పని చేస్తూ వివాదరహితుడుగా కొనసాగారు. ఆయన మృతికి న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు ఆధ్వర్యంలో న్యాయవాదులు, గుమాస్తాలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు.

విశ్రాంత లెక్చరర్ మృతి

సదుం: మండలంలోని బూరగమంద పంచాయతీ రామాపురానికి చెందిన డిగ్రీ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ రాజన్న (70) అస్వస్థతతో సోమవారం మృతి చెందారు. ఆయన మృత దేహానికి పలువురు నివాళులు అర్పించారు. అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించారు.

వినికిడి దినంపై అవగాహన ర్యాలీ



రొంపిచెర్లలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రొంపిచెర్ల: వినికిడి లోపం ఉన్న వారు పెద్ద శబ్దాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరమని రొంపిచెర్ల పీహెచ్‌సీ వైద్యులు వినయ్ అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా రొంపిచెర్ల వీధుల్లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మాట్లాడుతూ, వినికిడి సమస్యలున్న వారు వైద్యుల సలహా లేనిదే చెవులలో ఎలాంటి మందులు వాడరాదన్నారు. చెవుల్లో ఎలాంటి ద్రవాలు, నూనెలు, ఆకు పసర్లు పోయరాదన్నారు. వీటి వలన వినికిడి సమస్య మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉందన్నారు. చెవులు వినపడని వారు వినికిడి యంత్రాలు వాడటం మంచిదన్నారు. టీవీలు చూసేవారు, ఇయర్ ఫోన్లు వాడే వారు తక్కువ శబ్దంతో వినాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక శబ్దాలతోనే వినికిడి లోపం



బైరెడ్డిపల్లె తీర్థంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బైరెడ్డిపల్లె: అధిక శబ్దాలను వినడం వలన వినికిడి లోపం వచ్చే అవకాశం ఉందని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మావతి అన్నారు. మండలంలోని తీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వినికిడి దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కొంత మంది టీవీల సౌండ్‌ను ఎక్కువగా పెట్టుకుంటున్నారని, డీజే మ్యూజిక్, ఇయర్ ఫోన్స్ ఎక్కువగా వాడకం మంచిదికాదన్నారు. వయస్సు పైపడటం, చెవిలో గుబిలి పేరుకుపోవడం, దీర్ఘకాలిక చెవి ఇన్‌ఫెక్షన్, తలకు గాయం కావడం వలన కూడా వినికిడి లోపం వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్‌ఎస్ శ్రీదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న దృశ్యం

పుంగనూరు: పట్టణంలోని 1500 పేద ముస్లిం కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, బీఏఆర్ గ్రూప్ చైర్మన్ బీఏఆర్.మహమ్మదాలి ఆధ్వర్యంలో రంజాన్ తోఫా కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 18 రకాల నిత్యావసర సరకులను కిట్లుగా తయారు చేసి ఎన్‌ఎస్ పేటలో పంపిణీ చేశారు. రెండు రోజుల్లో పట్టణంలో పూర్తిగా పంపిణీ చేస్తామని ఆయన వ్యక్తిగత సహాయకుడు ఆనంద తెలిపారు. ఒకవైపు పెన్షన్లు, మరో వైపు రంజాన్‌తోఫా కిట్లు పంపిణీ చేయడంతో ముస్లింలు తండోపతండాలుగా తరలివచ్చి తీసుకెళ్లారు. ప్రతి ఏటా బీఏఆర్ మహమ్మదాలి ఈ వితరణ చేయడం ఆనవాయితీ.



రంజాన్ తోఫాకు తరలి వచ్చిన ముస్లిం మహిళలు

వర్మీ కంపోస్ట్ సద్వినియోగం చేసుకోండి



వర్మీ కంపోస్టునును కలెక్టర్ నుంచి కొనుగోలు చేస్తున్న వార్డు సభ్యుడు

వి.కోట: వి.కోట మేజర్ పంచాయతీ తయారు చేసిన నాణ్యమైన వర్మీ కంపోస్ట్‌ను సోమవారం చిత్తూరు కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. స్థానిక పంచాయతీ ఈఓ శివశంకర్ మాట్లాడుతూ, పబ్లిక్ గ్రీవెన్స్ డే సందర్భంగా వర్మీ కంపోస్ట్‌పై చిత్తూరులో స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. రైతులకు 550 కేజీల బ్యాగ్‌లను బట్ట సంచిలో నింపి తక్కువ ధరకే ఇస్తున్నామని, దీనిని రైతులు ఆదరించాలని కోరారు. ఈ ఎరువును ఇళ్ల వద్ద మొక్కలు, చెట్లకు, పంటల సాగుకు కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. మేజర్ పంచాయతీ 5 వార్డు మెంబర్ కుమార్ రాజా కలెక్టర్ వద్ద వర్మీ కంపోస్టు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ సాధిక్ అలీ, పృథ్వీ, బాలకృష్ణ, చంద్రబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గొంతెండుతున్న కరణంవారిపల్లె

- ట్యాంకు సరే! కనెక్షనేది సారూ..?
- నెలలు గడచిపోతున్నా పట్టించుకోని వైనం
- నీళ్ల కోసం వ్యవసాయ బోర్ల వద్దకు పరుగు

చౌడేపల్లె: మండలంలోని కాగతి పంచాయతీ కరణంవారిపల్లెలో ప్రజల సౌకర్యార్థం లక్షలాది రూపాయలు వ్యయం చేసిన కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంకును వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే గత ఏడాది ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అప్పట్లో దీనిని ప్రారంభించలేదు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటివరకూ ట్యాంకుకు నీటి కనెక్షన్ ఇవ్వకపోవడంతో గ్రామంలోని 25 కుటుంబాలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయి. నీళ్ల కోసం మహిళలు వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అధికారుల దృష్టికి సమస్యను నివేదించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



కరణంవారిపల్లెలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు